ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.16.01.2026 సమయం. 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. స్టార్టప్ ఇండియా కార్యక్రమం కేవలం ఒక పథకం కాదని, విభిన్న రంగాలను కొత్త అవకాశాలతో అనుసంధానించే 'రెయిన్‌బో విజన్' అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
2. హైదరాబాద్ మెట్రో మొదటి దశకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిన తర్వాతనే రెండో దశ నిర్మాణాలపై కేంద్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.
3. గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవల అంశంపై ఈ రోజు హైదరాబాద్ లో నిర్వహించిన సదస్సును కేంద్ర గిరిజన శాఖ మంత్రి జువల్ ఓరం ప్రారంభించారు.
4. రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధుల కోసం ప్రధానమంత్రితో సహా వివిధ కేంద్ర మంత్రులను కలుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

-----------------------

**స్టార్టప్ ఇండియా – ప్రధాన మంత్రి**

స్టార్టప్ ఇండియా కార్యక్రమం కేవలం ఒక పథకం కాదని, విభిన్న రంగాలను కొత్త అవకాశాలతో అనుసంధానించే 'రెయిన్‌బో విజన్' అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. న్యూఢిల్లీలో జాతీయ స్టార్టప్ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడారు. స్టార్టప్ ఇండియా మిషన్ కేవలం పదేళ్లలోనే ఒక విప్లవంగా మారిందని, దేశవ్యాప్తంగా కొత్త సంస్కృతిని పెంపొందిస్తుందని అన్నారు. భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ అని ప్రధాన మంత్రి పేర్కొన్నారు.

**బైట్...ప్రధాన మంత్రి**

**NSD**

------------------------------------

**కిషన్ రెడ్డి ...**

హైదరాబాద్ మెట్రో రెండో దశ పనులకు సంబంధించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. రెండో దశ నిర్మాణం గురించి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో చర్చించినట్టు లేఖలో పేర్కొన్నారు. మెట్రో మొదటి దశ లావాదేవీలు పూర్తయిన తర్వాత రెండో దశ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఎల్ అండ్ టీ నుండి మెట్రో నెట్ వర్క్ ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న తర్వాతనే మెట్రో రెండో దశ నిర్మాణానికి ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వాలన్నారు. ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. రెండో దశకు సన్నాహాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరపున వేసే కమిటీ కోసం రాష్ట్రం నుండి ఇద్దరు అధికారుల పేర్లను పంపాలని కోరారు.

**MSL**

-------------------------------

**మేడారంలో మంత్రివర్గం భేటీ...**

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 18న సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మేడారంలో జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణంగా సచివాలయంలో జరిగే కేబినెట్ సమావేశాన్ని ఈసారి గిరిజన ప్రాంతమైన మేడారంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రివర్గ భేటీకి సంబంధించి తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని రామకృష్ణారావు ఆదేశించారు.

**( డెస్క్)**

---------------------------------

**సుప్రీం – ఎమ్మెల్యేల అనర్హత కేసు..**

రాష్ట్రంలో ఎమ్మెల్యేల అనర్హత కేసుపై సుప్రీంకోర్టులో ఈ రోజు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ మసీహ్ ధర్మాసనం విచారణ జరపింది. స్పీకర్ తీసుకున్న చర్యలపై ఆయన తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోర్టుకు నివేదికను అందచేశారు. ఇప్పటివరకు ఏడుగురు

ఎమ్మెల్యేలపై విచారణ జరిపి తీర్పు వెలువరించారని నివేదికలో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల అమలులో స్పీకర్ విఫలమయ్యారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మిగతా ఎమ్మెల్యేల విచారణను నాలుగు వారాల్లో పూర్తి చేయాలని న్యాయస్థానం సూచించి, తదుపరి విచారణను రెండు వారాల పాటు  వాయిదా వేసింది.

( డెస్క్)

-------------------------

**మేడారం జాతర...**

ములుగు జిల్లా మేడారం లో భక్తుల రద్దీ పెరిగింది. సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. మేడారం పరిసరాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. సమ్మక్క-సారలమ్మ దర్శనానికి క్యూలైన్‌లలో భక్తులు పెద్ద సంఖ్యలో వేచి ఉన్నారు. కాగా, రోజురోజుకు మేడారంలో భక్తుల రద్దీ పెరుగుతుండటంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క పర్యవేక్షణలో జాతర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

( డెస్క్)

---------------------------------

**గిరిజన ఆరోగ్య సేవలు  కేంద్ర మంత్రి జువల్ ఓరం**

కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం ఈ రోజు హైదరాబాద్ శివారులోని చేగురూ గ్రామంలో గల  కన్హ శాంతి వనంలో  ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం, కేంద్ర గిరిజన వ్యవహారాల సహాయ మంత్రి దుర్గదాస్ ఊకే  తో పాటు  తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి  అడ్లూరి లక్ష్మణ్ కుమార్  పాల్గొన్నారు.

( డెస్క్)

-------------------------

**సీఎం  - నిర్మల్ సభ**

రాష్ట్రాభివృద్ధి, అందుకు అవసరమైన నిధుల కోసం ప్రధానమంత్రితో సహా కేంద్ర మంత్రులనెవరినైనా కలుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నిర్మల్ లో ఏర్పాటు చేసిన "ప్రజా పాలన- ప్రగతి బాట" బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రధానమంత్రి అనుమతిస్తేనే రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు వస్తాయని అన్నారు. అందుకే ప్రధానమంత్రిని తరచుగా కలవడం జరుగుతుందన్నారు. తమ ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, సన్న వడ్లు పండించిన రైతులకు క్వింటాలుకు 500ల రూపాయల బోనస్ చెల్లించడం జరుగుతుందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తునే సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు.

**బైట్ రేవంత్ రెడ్డి**

**( పిటిసీ నిర్మల్)**

---------------------------

**సీఎం – చనాక కొరాట**

ఆదిలాబాద్ జిల్లా భోరాజ్ మండలం హతిఘాట్‌లో చనాకా-కొరాటా పంప్‌హౌస్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా 386 కోట్ల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి వరుసగా శంకుస్థాపనలు చేశారు. అనంతరం నిర్మల్ జిల్లా మామడ మండలం పొనకల్ లో గోదావరి నదిపై నిర్మించిన సదర్మాట్ బ్యారేజీని ముఖ్యమంత్రి ప్రారంభించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు తో పాటు స్థానిక శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**( పిటీసీ – ఆదిలాబాద్, నిర్మల్ )**

--------------------------------

**ప్రకృతి వ్యవసాయం**

గత పది సంవత్సరాల నుండి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ,జాతీయ,రాష్ట్ర స్థాయి అవార్డులను అందుకున్న వనపర్తి జిల్లా,పెద్దగూడెం గ్రామానికి చెందిన యువ రైతు రవి సాగర్ పలువురికి ఆదర్శంగా నిలిస్తున్నారు. సమీకృత వ్యసాయంతో ఆరోగ్యవంతమైన వ్యక్తి, సమాజం, గ్రామం, దేశం ఏర్పడుతుందన్నారు.

**బైట్ - రవి సాగర్, యువ రైతు**

**(పిటిసీ వనపర్తి)**

**-------------------------------------**

**వివేక్ వెంకట స్వామి**

చెన్నూరు నియోజక వర్గం లో 100 కోట్లతో చేపట్టిన అమృత్ స్కీమ్ పథకం ద్వారా చెన్నూరు,మందమర్రి, క్యాతన పల్లి మున్సిపాలిటీలలో ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు అందించబోతున్నామని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీలో 45 కోట్ల రూపాయల తో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

**( పిటిసీ – మంచిర్యాల)**

**----------------------------------**